క్లుప్తంగా

క్యాలెండర్లు ఆవిష్కరణ



నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న మల్లు నందిని, తదితరులు

మధిర: శ్రీనిధి విద్యాసంస్థల ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం మధిర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తక్కువ ఫీజుతో మధిర ప్రాంతంలో నాణ్యమైన విద్యను అందిస్తున్న శ్రీనిధి విద్యాసంస్థల యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి విద్యాసంస్థల చైర్మన్ అనీల్ కుమార్ నెహ్రూ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్యాం ప్రసాద్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే



సూరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లకు చెందిన రిటైర్డ్ లెక్చరర్ కొణపర్తి సూరయ్య దశ దిన కర్మ గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు జమ్ముల జితేందర్ రెడ్డి, యర్రా బాబు, సింగు నరసింహారావు, ఎండీ మౌలానా, తాటి వెంకటేశ్వర్లు, పోటు కళావతి, స్థానిక నాయకులు పీవీ రావు, లేడి బోయిన గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో 'ఫ్రీ మీల్స్ ఆన్‌వీల్స్'



అల్పాహారం పంపిణీ చేస్తున్న కొత్తూరు ఉమామహేశ్వరరావు

సత్తుపల్లిటౌన్: లయన్స్‌క్లబ్ నిర్వహిస్తున్న ఫ్రీమీల్స్ ఆన్‌వీల్స్ కార్యక్రమం సత్తుపల్లిలో గురువారం 200వ రోజుకు చేరింది. స్థానిక బస్టాండ్ సెంటర్, ప్రభుత్వాస్పత్రి, పాతసెంటర్ ప్రాంతాల్లో రోగులు, భవన నిర్మాణ కార్మికులు, నిస్సాహయులకు అల్పాహారం అందించారు. ముగింపు సందర్భంగా స్థానిక కౌన్సిలర్ కొత్తూరు ఉమామహేశ్వరరావు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు దొడ్డా కృష్ణయ్య, పెనుగొండ రమేష్, గుండు శ్రీనివాసరావు, గండ్ర సోమిరెడ్డి, కొత్తూరు సత్యనారాయణ, జగన్మోహన్‌రావు, బచ్చు శ్రీనివాసరావు, మందపాటి చెన్నారెడ్డి, గోపాలరావు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు..

చింతకాని: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజేందర్ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్‌లో మండల వ్యాప్తంగా ఉన్నటువంటి రౌడీషీటర్లకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరిపై నిఘా ఉంచుతామని తెలిపారు.

ఎయిడ్స్‌పై కళా ప్రదర్శన

తల్లాడ: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణపై గురువారం స్థానిక బస్టాండ్ సమీపంలో కళా ప్రదర్శన నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆధ్వర్యంలో కాంపాటి శ్రీను పల్లె సుద్దుల కళా బృందం ఎయిడ్స్ ఎలా వస్తుంది, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను నాటిక రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని.. జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. పీపీటీసీ కేంద్రాల్లో తన జీవిత భాగస్వామితో హెచ్‌ఐవీ పరీక్ష చేయించుకొని పుట్టబోయే బిడ్డను కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుధారాణి, చంద్రమోహన్, ప్రేమకుమారి, శివ జోజి పాల్గొన్నారు.

డిప్లొమా ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిరూరల్: 2023–24 విద్యాసంవత్సరంలో గత డిసెంబర్‌లో నిర్వహించిన పాలిటెక్నిక్ 1, 3, 5వ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో సత్తుపల్లి మిస్ట్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

అభయహస్తం దరఖాస్తుల సూపర్ చెకింగ్ !

- వార్డుల వారీగా క్షుణ్ణంగా పరిశీలన
- సూచనలు చేస్తున్న అధికారులు



సిబ్బందికి సూచనలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ కె.సుజాత



సత్తుపల్లి మున్సిపాలిటీలో దరఖాస్తుల తనిఖీని పర్యవేక్షిస్తున్న మేనేజర్ శ్రీనివాసరావు

సత్తుపల్లిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన అభయహస్తం దరఖాస్తులను సత్తుపల్లి, వైరా, మధిర మున్సిపాలిటీల్లో గడువుకు ముందుగానే ఆన్‌లైన్ చేశారు. దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన ఆన్‌లైన్ నిర్వహించిన అధికారులు ప్రస్తుతం ఆ దరఖాస్తులను సూపర్ చెకింగ్ నిర్వహిస్తున్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీలో 9,712 దరఖాస్తులు, వైరా మున్సిపాలిటీలో 9,697, మధిర మున్సిపాలిటీలో 9,175 దరఖాస్తులు వచ్చాయి. వీటిలోని సమాచారంలో తప్పుడు దొర్లకుండా అధికారుల ఆధ్వర్యాన క్షుణ్ణంగా పరిశీలన కార్యక్రమం చేపట్టారు.

వార్డుల వారీగా..

మున్సిపాలిటీలోని వార్డుల వారీగా దరఖాస్తులను వేరుచేశారు. వీటిని ప్రత్యేకంగా సిబ్బందితో పరిశీలన కార్యక్రమం చేపట్టారు. సిబ్బందిపై పర్యవేక్షణకు సూపర్ టీమ్‌ను నియమించారు. ఈ అభయహస్తం దరఖాస్తులను ప్రజలు తెలుగులో ఇవ్వటంతో.. ఇంగ్లీష్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేసినప్పుడు పేరులో మార్పులు ఏమైనా వచ్చాయా..? ప్రతి ఒక్కరి ఆధార్‌కార్డు జిరాక్స్‌లోని పేరును దరఖాస్తులోని పేరు, ఆధార్ నంబర్‌తో సరి చూడటం, రేషన్‌కార్డు నంబర్లు ఉన్నాయా లేదా పరిశీలించటం, ఇంటి అడ్రస్‌లు ఖచ్చితంగా ఉండేలా అందులోని ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి నమోదు చేయడంలో సిబ్బంది తలమునకలౌతున్నారు. ఈ మాస్టర్ చెకింగ్‌ను పూర్తి చేసి నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని మున్సిపల్ కమిషనర్ కె.సుజాత తెలిపారు.

రహదారి నిబంధనలు పాటించాలి



పెనుబల్లి: అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ విజయలక్ష్మి

వైరా/పెనుబల్లి: వాహనదారులు రహదారి నిబంధనలు పాటించాలని వైరా మోటర్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ శంకర్‌నాయక్, ఎంవీఐ విజయలక్ష్మి తెలిపారు. వైరాలో గురువారం లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రతా వారోత్సవాల కార్యక్రమంలో శంకర్‌నాయక్ పాల్గొని మాట్లాడారు. అనంతరం రోడ్డు భద్రతకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అదే విధంగా పెనుబల్లి మండలంలోని ముత్తగూడెం చెక్‌పోస్టు వద్ద వాహనదారులకు వాహన ప్రమాదాలపై విజయలక్ష్మి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనవరి 15 నుంచి ఫిబ్రవరి 15 వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని.. వాహనదారులు అతి వేగాన్ని తగ్గించి జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ తప్పని సరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడప వద్దన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు 100కు డయల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌కే బాబుజానీ, సెక్రటరీ ముళ్లపాటి రంగారావు, ట్రెజరర్ షేక్ యాకూబ్, ముళ్లపాటి వెంకటేశ్వర్లు, శీలం వెంకటరామిరెడ్డి, రేచర్ల రామారావు, విశ్వనాథం, బీముడు, డ్రైవర్లు పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోలు చేయాలి

తల్లాడ: సీసీఐ కేంద్రాల్లో సీజన్ ముగిసే వరకు పత్తిని కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అన్నారు. తల్లాడలో గురువారం దొడ్డా కృష్ణయ్య భవనంలో కల్యాణపు కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో రమేష్ మాట్లాడుతూ.. ఈ ఏడాది పత్తి రైతులు చీడ పీడలతో తీవ్రంగా నష్ట పోయారన్నారు. పత్తిని సీసీఐ కేంద్రాల్లో అమ్ముకుందామని ఆశ్రయిస్తే అనేక నిబంధనలతో కొనుగోలు చేయటం లేదని.. పంట కాలం మొత్తం కొనుగోలు చేయకుండా అప్పుడప్పుడు మాత్రమే కొనుగోలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు శీలం సత్యనారాయణరెడ్డి, అయినాల రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు, రాజబోయిన సైదులు, మన్నేపల్లి రామారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాదినేని రమేష్

సాయి మందిరంలో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కల్లూరు: కల్లూరులోని శ్రీ సాయిరామధ్యాన మందిరంలో గురువారం నిర్వహించిన ఉచిత హోమియో మరియు జనరల్ చెకప్ శిబిరం విజయవంతమైంది. వైద్యులు 225 మందిని పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం సాయిరామ ధ్యాన మందిరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హోమియో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దీపికారెడ్డి, పెనుబల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస నాయక్, జనరల్ వైద్యులు శ్రీవిద్య, ఆలయ కమిటీ నిర్వాహకులు కొప్పురపు బలరామ్, జి.బావాజి, గార్లపాటి శ్రీనివాసరావు, బొగ్గవరపు మొరళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మారావుపేటలో..

ఏన్కూరు: మండల పరిధిలోని తిమ్మారావుపేటలో ఖమ్మం శ్రీరక్ష హాస్పటల్, పాల్వంచ ఎల్‌వీప్రసాద్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ ఆరెం వరలక్ష్మి తెలిపారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్యామల, ఎంపీటీసీ లచ్చిరాం నాయక్, నారాయణ, టీడీపీ నాయకులు అప్పారావు, రామయ్య, సత్యం, శ్రీనివాస్, వీరబ్రహ్మం, కామేష్, రాములు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



ప్రిన్సిపాల్ సైదులు

కొణిజర్ల: మండలంలోని అమ్మపాలెంలో గల తెలంగాణ ముస్లిం మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సైదులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి మరియు ఇంటర్మీడియట్ విద్యాసంవత్సరానికి పూర్తిగా 6, 7, 8 తరగతుల్లో బ్యాక్‌లాగ్ మైనార్టీ సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు గురుకుల వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మైనార్టీలకు 75 శాతం, నాన్ మైనార్టీలకు 25 శాతం సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో గురువారం జాతీయ పెన్షనర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భముగా జిల్లా కమిటీ అధ్యక్షుడు కల్యాణం కృష్ణయ్య మాట్లాడుతూ.. పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం సకాలంలో పరిష్కరించాలన్నారు. అనంతరం విశ్రాంత ఉద్యోగులు బొగ్గుల వీరారెడ్డి, రవికుమార్, ఎస్.విజయలక్ష్మి, ఎస్.తాతారావు, వేములపల్లి శంకర్‌రావు, బి.కాంతారావు, శీలం విజయలక్ష్మి లను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శీలం ప్రతాపరెడ్డి, రాఘవరపు కోటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేదరమెట్ల సుబ్బయ్య, వై.పద్మావతి, పి.శరత్, జమలాపురపు గోపాలకిషన్‌రావు, కంచర్ల వెంకటనర్సయ్య, శ్రీపాలశెట్టి తిరుపతిరావు, సీహెచ్ మందయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ప్రచారం

కల్లూరురూరల్: కేంద్ర పథకాలపై వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పేరుతో గురువారం చెన్నూరులో ప్రచార కార్యక్రమం సర్పంచ్ పాలెపు లక్ష్మీకాంతమ్మ చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రధాని ఆరోగ్య సంరక్షణ పథకం, రహదారుల నిర్మాణం, గ్రామీణ మహిళలకు సబ్సిడీపై గ్యాస్ పంపిణీ గ్రామ పంచాయతీలకు మంజూరు చేసిన నిధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆయకట్టు రోడ్ల ఆక్రమణపై విచారణ



ఆక్రమణపై విచారణ చేస్తున్న అధికారులు

కల్లూరురూరల్: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో ఆయకట్టు ఆక్రమణకు గురైన వాటిపై తహసీల్దార్ పులి సాంబశివుడు గురువారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మీపురం24–36 మీటర్ల రహదారిలో 392 మీటర్లు, బత్తులపల్లిలో 950 మీటర్ల రోడ్డులో 550 మీటర్ల రోడ్డు, రఘునాథగూడెం 19–95 మీటర్ల రోడ్డులో 270 మీటర్ల రోడ్డు ఆక్రమణకు గురైంది. పేరువంచ 1,600 మీటర్లు రోడ్డుకు గాను 600 మీటర్లు, తాళ్లూరు1,550 మీటర్లు రోడ్డుకు గాను400 మీటర్లు, చిన్నకోరుకొండిలో 175 మీటర్ల రోడ్డుకు గాను 350 మీటర్లు, పాయపూరులో 250 మీటర్లు రోడ్డు ఆక్రమణకు గురైనట్లుగా గుర్తించారు. కలెక్టర్ ఆదేశానుసారం తొలగించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

సత్తుపల్లిరూరల్: మండలంలోని యాతాకుంటలో గురువారం గంగారం పీహెచ్‌సీ ఏఎన్‌ఎంలు విద్యార్థులకు, గ్రామస్తులకు రక్త పరీక్షలు నిర్వహించారు. పిల్లల్లో రక్తహీనతను గుర్తించేందుకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ అవినాష్ తెలిపారు. సికిల్ సెల్ అనీమియా లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు ఫాతిమా, పార్వతి, మంజుల, లక్ష్మి, కృష్ణవేణి, హైమావతి, మౌనిక పాల్గొన్నారు.

బీఎల్‌ఓల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామారావు

ముదిగొండ: ముదిగొండ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ రామారావు మాట్లాడుతూ.. 18సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. పట్టభద్రులు తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో నాయబ్ తహసీల్దార్ రెహమాన్, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

20న వ్యాసరచన పోటీలు

మధిర: అయోధ్యలో శ్రీరామ మందిర ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని మధిర రామాలయంలో ఈ నెల 20న మధ్యాహ్నం 1:30 గంటలకు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీరామ జన్మ తీర్థ ట్రస్ట్ మధిర డివిజన్ బాధ్యులు దుర్గాప్రసాద్, రాజేశ్వర శర్మ, శివరాజు శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధిర, ఎర్రుపాలెం మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని 7 నుంచి 10వ తరగతి విద్యార్థులు.. ప్రతీ తరగతి నుంచి ఇద్దరు చొప్పున ఈ పోటీల్లో పాల్గొనవచ్చునని తెలిపారు. శ్రీరాముని జీవితం – మానవాళికి ఆదర్శం అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పోటీల్లో గెలుపొందిన మొదటి మూడు ర్యాంకుల వారికి బహుమతులు అందిచడమే కాకుండా ప్రతీ ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, అదనపు సమాచారం కోసం 9652250523, 9492263483 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కమలాపురంలో క్రికెట్..

కారేపల్లి: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా.. మండలంలోని కమలాపురం గ్రామంలో ఎన్టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం గ్రామస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. అనంతరం క్రీడాకారులకు టీషర్టులు, టోపీలు అందించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, మండల అధ్యక్షురాలు చంద్రప్రకాశ్, నాయకులు భాస్కర్‌రావు, యాకూబ్, శ్రీనివాసరావు, వెంకట్, రామారావు, కోటయ్య, లక్ష్మీనారాయణ, టోనీవీరప్రతాప్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ముగ్గులు..

ఏన్కూరు: మండలంలోని తూతకలింగన్నపేట గుడ్ న్యూస్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు రంగు రంగులతో అందమైన ముగ్గుల వేశారు. విజేతలకు ఏన్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సైదయ్య బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బ్రిటో తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొణిజర్ల: మండలంలోని పెద్దగోపతి సబ్ డివిజన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏడీ తిలక్, ఏఈ సురేష్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు నిర్వహించడం, చెట్టు కొమ్మలను తొలగించే పనులు చేపడుతున్నందున పెద్దగోపతి సబ్ డివిజన్ పరిధిలోని కొణిజర్ల, పెద్దగోపతి, కొదుమూరు, చింతకాని సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని.. వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

కారేపల్లి ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

కారేపల్లి: కారేపల్లి ప్రెస్‌క్లబ్ నూతన కమిటీని గురువారం కారేపల్లి శివాలయ ప్రాంగణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా భీమవరపు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా పగడాల నాగేశ్వరరావు, కోశాధికారిగా పాలిక శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ఏపూరి లక్ష్మీనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా అనంతారపు వెంకటాచారి, సహాయ కార్యదర్శిగా శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, కృష్ణ, శ్రీనివాసరావు, ప్రవీణ్, వెంకటేశ్వర్లు, బాలు నాయక్, రాము నాయక్, ప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.

నేత్రదానం

పెనుబల్లి: మండలంలోని లింగగూడెం గ్రామానికి చెందిన స్వాతంత్ర సమరయోధుడు మిట్టపల్లి లక్ష్మీనారాయణ(103) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. సప్తపది లయన్స్‌క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించడంతో వారు మృతుడు లక్ష్మీనారాయణ నేత్రాలను సేకరించి, ఖమ్మం నేత్ర నిధికి తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు వెంకటేశ్వరరావు, ప్రభాకర్, సుబ్బారావు, గోపాలరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురువారం ఆలయాల అర్చకులు సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. బాబాకి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. మండలకేంద్రంలోని ఆలయంలో దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంచర్ల వెంకటస్వామి, కంచర్ల శ్రీనివాసరావు ఉన్నారు.

రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుల నియామకం

చింతకాని/ఎర్రుపాలెం: చింతకాని రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులుగా బీజేపీ నాయకులు కొండా గోపి, ఆలస్యం వీరప్రసాద్, అవులూరి శ్రీనివాసరెడ్డి, తోటకూరి పానకాలరావు, నాగాచారిలతో పాటు ఎర్రుపాలెం మండలంకేంద్రానికి చెందిన బీజేపీ దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి దేవరకొండ కోటేశ్వరరావు లను నియమిస్తూ సికింద్రాబాద్ రైల్వే డివిజన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైల్వేస్టేషన్ అభివృద్ధికి, ప్రయాణీకులకు ఇంకా కల్పించాల్సిన సదుపాయాలను గుర్తించి రైల్వే ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులుగా తమ నియామకానికి కృషి చేసిన బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. కోటేశ్వరరావు నియామకం పట్ల బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కమిటీ సభ్యుడు నూతక్కి నర్సింహారావు, మండల కమిటీ అధ్యక్షుడు ముక్కపాటి శ్రీనివాసరావు, నాయకులు తదితరులు అభినందించారు.

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, స్వర్గీయ నందమూరి తారకరామారావు వర్ధంతిని మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ జెండా ఆవిష్కరించి.. పులిహోర ప్యాకెట్లు, స్వీట్లు, పండ్లు పంపిణీ చేయడంతో పాటు అన్నదానాలు చేశారు. ఎన్టీఆర్ చేసిన ఎనలేని సేవలను తెలుగు ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరంటూ ఆయన సేవలను పలువురు కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లి: ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాగమయి, నాయకులు



మధిర: ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



వైరా: నివాళులర్పిస్తున్న టీడీపీ, కాంగ్రెస్ నాయకులు

వితరణల వెల్లువ..

విద్యార్థికి ల్యాప్‌టాప్..



విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: వైరా గ్రేటర్ విజన్ లయన్స్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో బీటెక్ చదువుతున్న వైరాకు చెందిన కుసుమ సాయికృష్ణ అనే నిరుపేద విద్యార్థికి ఉన్నత చదువుల నిమిత్తం ల్యాప్‌టాప్‌ను స్థానిక 6వ వార్డు కౌన్సిలర్ లగడపాటి లక్ష్మీరాజ్యం, ప్రభాకర్‌రావు దంపతుల సహకారంతో అందించారు. ఈ కార్యక్రమంలో పీడీజీ డాక్టర్ కాపా మురళీ కృష్ణ, జీఎంటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్యాంబాబు, తోటకూర శ్రీకాంత్, డాక్టర్ రవిచంద్ర, రామకృష్ణ, గోపి పాల్గొన్నారు.

వలంటీర్‌కు ఆర్థిక సాయం..

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గత కొంత కాలంగా విద్యా వలంటీర్‌గా కటారపు వెంకటేశ్వర్లు పనిచేస్తున్నారు. ఆయనకు నెలకు రూ.6వేల చొప్పున మూడు నెలల వేతనానికి గాను దాతలు స్థానిక సర్పంచ్ వేమిరెడ్డి అనురాధ రూ.6వేలు, ఎన్‌ఆర్‌ఐ లక్కిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి రూ.12వేలు వితరణ చేశారు. ఈ నగదును గురువారం పాఠశాలలో వలంటీర్‌కు సొసైటీ వైస్ చైర్మన్ షేక్.జానీబాషా, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సాబీరా భేగం, సొసైటీ డైరెక్టర్ జమలయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ ఇస్మాయిల్, కాంగ్రెస్ నాయకులు అందజేశారు.

నిరుపేద విద్యార్థికి రూ.20 వేలు..

కొణిజర్ల: పేదరికం చదువుకు ఆటంకం కాకూడదని మండలంలోని తుమ్మలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.అజిత, పరిశ సీతారత్నం ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య అన్నారు. మండలంలోని తుమ్మలపల్లికి చెందిన నిరుపేద విద్యార్థిని పందిళ్ల ఉషారాణి బీఫార్మసీ చదువుతూ కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేక పోవడంతో పరిశ సీతారత్నం ట్రస్టును ఆశ్రయించారు. దీంతో ట్రస్ట్ గతరెండేళ్లగా రూ.20 వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం ఉషారాణికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రేణుక, మాజీ సర్పంచ్ సత్యం, గడల శ్రీనివాసరావు, పుల్లారావు, అమూల్య, ఉపాధ్యాయులు వాసిరెడ్డి రాజశేఖర్, మంజుల, రమాదేవి, నిర్మల, వీరకుమారి, భద్రయ్య, శివరాణి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బీఫార్మసీ విద్యార్థిని ఉషారాణికి చెక్కు అందజేస్తున్న పరిశ పుల్లయ్య

నిరుపేద కుటుంబానికి రూ.5,600లు..

కారేపల్లి: మండలంలోని గుంపెళ్లగూడెం గ్రామానికి చెందిన బాదావత్ కృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా.. రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబంలో ఇంటిపెద్ద మృతి చెందటంతో.. ఆ నిరుపేద కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉండిపోయింది. నిరుపేద కుటుంబ దీనస్థితిని చూసి చలించిపోయిన.. గుంపెళ్లగూడెం అయ్యప్పస్వామి భక్త బృందం సభ్యులు రూ.5,600ల ఆర్థిక సాయాన్ని ఆ కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో తీర్థాల శివప్రసాద్, బానోత్ రమేష్, బానోత్ వీరభద్రం, బొర్ర రాము, భూక్యా శంకర్, రవి, నగేష్, మాలోత్ చందూ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అల్పాహారానికి విరాళం..

వైరారూరల్: మండలంలోని పాలడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు అల్పాహారం నిమిత్తం పాలడుగు గ్రామానికి చెందిన శ్రీ రామనేని హనుమంతరావు రూ.5 వేలు, వనమా జానకి రామయ్య రూ.1,116ల నగదును విరాళంగా అందించారు. అలాగే పాఠశాల హెచ్‌ఎం చావా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు విరాళాలు వేసుకున్న నేపథ్యాన సర్పంచ్ శీలం రమాదేవి అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఒడిశా వలస కూలీలకు స్వెటర్లు పంపిణీ



వలస కూలీలకు స్వెటర్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ కొనకళ్ల సుధారాణి

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి పట్టణానికి చెందిన సుధా ఛారిటబుల్ ట్రస్ట్ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ కొనకళ్ల సుధారాణి ఆధ్వర్యంలో గురువారం చెరుకుపల్లి సమీపంలోని తురకగూడెం ప్రాంతంలో 50 మంది ఒడిశా కార్మికులకు స్వెటర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. ప్రస్తుతం చలిగాలులు విపరీతంగా వీస్తుండడంతో ఉపాధికోసం ఒడిశా నుంచి వచ్చిన కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇటుక బట్టీల్లో పని చేస్తున్న కూలీల కష్టాలు చూడలేక స్వెటర్లు పంపిణీ చేశామన్నారు. కార్మికుల పిల్లలకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కోవిడ్ సమయంలో చెరుకుపల్లి, తురకగూడెం ప్రాంతంలో సుధా హెర్బల్ ఛారిటబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇతోధికంగా సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.